సాక్షి
ఆదిలాబాద్
సోమవారం । 27 । జనవరి । 2025



ప్రసంగిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

అర్హులందరికీ సంక్షేమం

- నాలుగు పథకాలకు శ్రీకారం
- జిల్లా సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ రాజర్షిషా



పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా



సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



గణతంత్ర వేడుకలకు హాజరైన ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు శంకర్, అనిల్ జాదవ్ తదితరులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతీ పథకాన్ని అర్హులందరికీ లబ్ధి చేకూర్చడంతో పాటు జిల్లా సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. 76వ గణతంత్ర వేడుకలను జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మువ్వన్నెల పతాకం ఆవిష్కరించి, జాతీయ గీతం ఆలపించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ ప్రక్రియకు ఆదివారం నుంచి శ్రీకారం చుట్టామన్నారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా, పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు.

గ్రామ, వార్డు సభల్లో 77వేల దరఖాస్తులు..

రాష్ట్రప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి ఆయా సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈనెల 21 నుంచి 24 వరకు జిల్లాలోని 473 గ్రామపంచాయతీలు, మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో చేపట్టిన గ్రామ, వార్డు సభల్లో 77,442 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

కొత్త రేషన్‌కార్డుల జారీకి..

జిల్లాలోని 18,741 కొత్త రేషన్‌కార్డు అర్హుల జాబితాను పరిశీలించి ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించామన్నారు. అలాగే మార్పులు చేర్పులకు సైతం అవకాశం కల్పించినట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సబ్సిడీ కింద ఇప్పటి వరకు 3,27,600 సిలిండర్లు

మద్దతు ధరతో కొనుగోళ్లు..

జిల్లాలో సీసీఐ, ప్రైవేట్ వ్యాపారుల ద్వారా 1,10,964 మంది రైతులకు కనీస మద్దతు ధర కల్పించి 23,85,677 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా 19,010 మంది రైతుల నుంచి 3,31,334 క్వింటాళ్ల సోయా కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఇందిరా క్రాంతి పథకం ద్వారా 569 మంది రైతుల నుంచి 1749.360 మెట్రిక్ టన్నులు గ్రేడ్-ఏ రకం బియ్యం, 326.2 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం మద్దతు ధరకు రూ.500 బోనస్ కల్పించి కొనుగోలు చేసినట్లు వివరించారు.

భూ సమస్యల పరిష్కారం కోసం..

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఆర్‌వోఆర్-2024 చట్టాన్ని రూపొందించిందన్నారు. ఈ చట్టం ద్వారా భూ హక్కుల రికార్డులో నమోదులను సరిదిద్దడం, పార్ట్-బిలో నమోదైన డిజిటల్ సంతకం కాని భూముల కోసం, సాదాబైనామా క్రమబద్ధీకరణ, రికార్డు నిర్వహణ కోసం సులభంగా ఉపయోగించే ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు, ప్రభుత్వ భూములను రక్షించడం వంటి లక్ష్యాలతో ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు.కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద ఇప్పటివరకు జిల్లాలో 36,398 కుటుంబాలకు 337.43 కోట్ల విలువ గల చెక్కులు అందించినట్లు వివరించారు.

సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకోసం రూ.9.24 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

వ్యవసాయ కూలీలకు భరోసా..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12వేల చొప్పున ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. గ్రామ, వార్డు సభల్లో 13,666 దరఖాస్తులు స్వీకరించినట్లు వివరించారు. అలాగే స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు రూ.48.52 కోట్లతో 3,359 మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌లు, రూ.15 లక్షలతో నాలుగు మహిళా శక్తి క్యాంటీన్లు, రూ.63లక్షలతో 95పాడిగేదెలు, రూ.40లక్షలతో 1,593 పెరటి కోళ్ల పెంపకం, రూ.36 లక్షలతో ఆరు మదర్ పౌల్ట్రీ, రూ.2లక్షలతో ఒక మిల్క్ పార్లర్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు 45.45 లక్షల పనిదినాలు కల్పించి రూ.113.18 కోట్లు, మెటీరియల్ కింద రూ.37.47 కోట్లు వివిధ రకాల పనులకు చెల్లించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలోనే తొలిసారిగా 'ఆరోగ్య పాఠశాల'..

జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్రంలోనే జిల్లాలో మొదటిసారిగా 'ఆరోగ్య పాఠశాల'కు శ్రీకారం చుట్టామన్నారు. 133 ఉన్నత పాఠశాలల్లో ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే డీఎస్సీ 2024 ద్వారా అక్టోబర్‌లో 268 ఉపాధ్యాయులను నియమించామన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు..

ఇందిరమ్మ పథకం కింద జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇళ్ల సర్వేయాప్ ద్వారా 1,06,690 దరఖాస్తులను సర్వే చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఇటీవల నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో 22,309 దరఖాస్తులు వచ్చాయని, అర్హులందరికీ మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

62వేల మందికి రుణమాఫీ..

జిల్లాలో రూ.2 లక్షల వరకు రుణం తీసుకున్న రైతులకు సంబంధించి ఇప్పటివరకు 62,016 మందికి నాలుగు విడతల్లో రూ.685.42 కోట్లు జమచేసినట్లు వివరించారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు..

ఎస్సీ అభివృద్ధి శాఖ ద్వారా ఈ విద్యా సంవత్సరం 2,364 మంది విద్యార్థులకు రూ.3కోట్ల 3లక్షల 22వేలు పోస్టుమెట్రిక్ ఉపకారవేతనాలు అందించినట్లు తెలిపారు.

పంటలకు సాగునీరు..

లోయర్ పెన్‌గంగ, చనఖా-కొరటా ప్రాజెక్టుల భూసేకరణకు రూ.134 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు పేర్కొన్నారు. అనుమతులకు సంబంధించి రూ.71.96 కోట్లు మంజూరై వచ్చే ఖరీఫ్ వరకు 27,800 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

రైల్వే బ్రిడ్జిల కోసం..

ఆదిలాబాద్ పట్టణంలో రైల్వే ఓవర్‌బ్రిడ్జి, తాంసి బస్టాండ్ వద్ద అండర్ బ్రిడ్జిల నిర్మాణం కోసం రూ.97.20 కోట్లు, రహదారుల అభివృద్ధికి రూ.18.99 కోట్లు మంజూరై పనులు పురోగతిలో ఉన్నట్లు పేర్కొన్నారు. రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ఆదిలాబాద్ నియోజకవర్గానికి రూ.10.44 కోట్లు, బోథ్ నియోజకవర్గానికి రూ.16.16 కోట్లు, ఆసిఫాబాద్ నియోజకవర్గానికి రూ.5.70 కోట్లు మంజూరై టెండర్ దశలో ఉన్నట్లు వివరించారు.

ఉపాధి హామీ ద్వారా..

ఎంఆర్‌ఆర్ గ్రాంట్ కింద 45 పనులకు రూ.52.35 కోట్లు, ఎఫ్‌డీఆర్ కింద 84 పనులకు రూ.91.41 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. జాతీయ ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో 37 కొత్త గ్రామపంచాయతీ భవనాలకు రూ.7.40 కోట్లు, 67 అంగన్‌వాడీ భవనాలకు రూ.8.4 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

పట్టణాభివృద్ధికి..

టీయూఎఫ్ఐడీసీ కింద రూ.10.50 కోట్ల నిధులు మంజూరై పట్టణంలో బీటీ, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. మహిళా శక్తి పథకంలో భాగంగా వ్యక్తిగత వ్యాపారం కింద 83 యూనిట్లు, సామూహిక వ్యాపారం కింద ఆరుయూనిట్లను స్థాపించినట్లు పేర్కొన్నారు. అమృత్ 2.0 పథకం కింద రూ.95.50 కోట్లతో పట్టణ ప్రజలకు నీటి సరఫరా చేసే పనులు పురోగతిలో ఉన్నాయని, అండర్ డ్రైయినేజీ కోసం రూ.224.65 కోట్ల నిధులు మంజూరైనట్లు వివరించారు.

గిరిజన సంక్షేమ శాఖ..

జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 4 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పీఎం జన్‌మన్ పథకం కింద జిల్లాలోని 1,460 కొలాం, తోటి లబ్ధిదారులకు 25 వందన్ వికాస్ కేంద్రాల దావరా శిక్షణ కల్పించి చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

శాంతిభద్రతల పరిరక్షణ..

పోలీసు శాఖ ద్వారా ఇంటర్ సెప్టర్ వాహనాన్ని జిల్లాలో తొలిసారిగా ప్రారంభించామన్నారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రత్యేక యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి యువతను చైతన్యపర్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సైబర్‌క్రైమ్ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించడం, శాంతిభద్రతల పరిరక్షణలో, ఆర్థిక నేరాల నియంత్రణలో గస్తీ, పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేస్తూ నేరాల కట్టడికి జిల్లా పోలీసు యంత్రాంగం విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి ప్రభాకర రావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, ఎస్పీ గౌస్ ఆలం,ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీఈవో ప్రణీత, జిల్లా సంక్షేమ అధికారి సబితా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.







సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఆదిలాబాద్: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన వేడుకలు అంబరాన్నంటాయి. విద్యార్థుల సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు గిరిజన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ చేసిన ఆదివాసీ, లంబాడా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయా రాష్ట్రాల కళలు, సంప్రదాయాలను ప్రదర్శించిన జెడ్పీఎస్ఎస్ బేల విద్యార్థినులు ఔరా అనిపించారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినుల అన్నదాతలపై ప్రదర్శించిన కళా ప్రదర్శన అలరించింది. మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో కనువిందు చేశారు. జెడ్పీఎస్ఎస్ సరస్వతీనగర్ విద్యార్థినులు జయహో పాటపై పిరమిడ్స్ చేస్తూ ఆరోగ్య ఆవశ్యకతను తెలిపారు. అనంతరం నృత్య ప్రదర్శన చేసిన పాఠశాలల నిర్వాహకులకు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందించారు.

ఆకట్టుకున్న శకటాలు

ఆదిలాబాద్: గణతంత్ర వేడుకల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శించిన శకటాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా తొలిసారి వేడుకల్లో భాగంగా పోలీస్ శాఖ ప్రదర్శించిన శకటానికి ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చింది. అలాగే మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహం నేరమని తెలుపుతూ, పచ్చటి పందిరి వేసి, కల్యాణ ఘట్టం జరుగుతున్నట్లు ప్రదర్శన చేయడం సందేశాత్మకంగా నిలిచింది. అలాగే రవాణ,విద్యాశాఖలతో పాటు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ,ఆర్టీసీ, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, రిమ్స్, పౌరసరఫరాల శాఖలు ప్రదర్శించిన శకటాలు సైతం అబ్బురపరిచాయి. అనంతరం శకటాలు ప్రదర్శించిన శాఖ ఉన్నతాధికారులకు ప్రశంసపత్రాలు అందించారు.







ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శకటాలు

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడలో నాలుగు పథకాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరు గ్యారెంటీల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశ పెట్టిన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులను అర్హులందరికీ వందశాతం అందజేస్తామన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో ఒక్కోగ్రామం చొప్పున నాలుగు పథకాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల అకౌంట్లలో సోమవారం నుంచి డబ్బులు జమ అవుతాయన్నారు. గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ పథకం ద్వారా స్లాబ్ ఇళ్లను నిర్మించి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పిప్పర్‌వాడలో 288 మందికి సంక్షేమ పథకాలు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అశోక్ రెడ్డి, తహసీల్దార్ శ్యామ్‌సుందర్, ఎంపీడీవో వెంకట్ రాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు మంజూరు పత్రం అందజేస్తున్న కలెక్టర్ రాజర్షిషా, తదితరులు

హస్నాపూర్‌లో..

తాంసి: మండలంలోని హస్నాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించి ఎంపిక చేసిన లబ్ధిదారులకు కలెక్టర్ మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్ స్వామి, మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ, డీఎస్పీ జీవన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి, వ్యవసాయశాఖాధికారి రవీందర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ

గుడిహత్నూర్: ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా అన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా మండలంలోని వైజాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. అర్హులుగా ఉండి ఆయా పథకాలకు దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతాయని ఆ దిశగా క్షేత్ర స్థాయిలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మొదటి దశలో మంజూరు కాని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. తదుపరి పరిశీలనలో మిగిలిన వారికి పథకాలు మంజూరు అవుతాయన్నారు. అనంతరం 57 మందికి రేషన్‌కార్డులు, 199 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 58 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 90 మందికి రైతు భరోసా పథకాల మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సునీత, తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్‌హై, పంచాయతీ కార్యదర్శి అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌బ్లడ్ బ్యాంక్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం



అవార్డు అందుకుంటున్న సుధాకర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో గల బ్లడ్‌బ్యాంకుకు రాష్ట్రస్థాయి పురస్కారం దక్కింది. ఈ బ్లడ్‌బ్యాంక్ ద్వారా రోగులకు అందించిన సేవలకు గాను గణతంత్ర దినోత్సవం పురస్కరించుని తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టి శాక్స్) ఈ అవార్డును ప్రకటించింది. హైదరాబాద్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో ఆ విభాగం రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి చేతుల మీదుగా బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ సుధాకర్, ల్యాబ్‌టెక్నీషియన్ నర్సారెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

ఈకేవైసీ తెచ్చిన తంటా

- 110 మంది వృద్ధులకు ఆగిన పింఛన్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన 110 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ నిలిచిపోయింది. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. అయితే వీరంతా 80 ఏళ్లకు పైబడిన వారే. ప్రతి నెలా పింఛన్ డబ్బులను అధికారులు వీరి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే ఈకేవైసీ వివరాలు లేకపోవడంతో ఈ నెల వారి పింఛన్‌ను నిలిపివేశారు. వయస్సు పైడిన వారు కావడంతో వారు జీవించి ఉన్నారా లేరా అనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఇటీవల బల్దియా కార్యాలయాన్ని సంప్రదించి పింఛన్ నిలిచిపోయిన లబ్ధిదారుల సమాచారం సేకరించారు. వారందించిన చిరునామాల ఆధారంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆయా కాలనీల్లోని వారి ఇళ్లకు వెళ్లి ఈకేవైసీ నమోదు చేయించేలా శ్రద్ధ వహిస్తున్నారు. కాగా ఈ విషయమై డీఆర్డీఏ పింఛన్ విభాగం ఏపీఎం జాదవ్ శేష్‌రావును 'సాక్షి' సంప్రదించగా వయస్సుపైబడిన వారు కావడంతో పింఛన్ పొందేందుకు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఇంటింటికి వెళ్లి ఈకేవైసీపై ఆరా తీస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 50మంది లబ్ధిదారుల వివరాలు నమోదు చేయించామన్నారు. మిగతా వారి అడ్రస్‌లు దొరక్కపోవడం, సెల్ నంబర్లు పనిచేయకపోవడం ఇబ్బందికరంగా మారుతుందన్నారు. బ్యాంకు ఖాతాల ద్వారా పింఛన్ పొందే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన సూచించారు.

బల్దియా ప్రత్యేకాధికారిగా ఖుష్బూ గుప్తా

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ గడువు ఆదివారంతో ముగిసింది. దీంతో ప్రత్యేక అధికారుల పాలన అనివార్యమైంది. సోమవారం నుంచి ప్రత్యేక పాలన ప్రారంభం కానుండడంతో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ ఆదివారం రాత్రి ఉత్వర్వులు జారీ చేసింది. గ్రేడ్-1 స్థాయి కలిగిన ఆదిలాబాద్‌కు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తాను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే స్థానిక సంస్థల అదన పు కలెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న ఖుష్బూ గుప్తా ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా కొనసాగుతున్నారు.

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

బెజ్జూర్‌: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తితో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కుంటలమానెపల్లికి బోర్‌కుట్టే ఎమ్మాజీ (48) వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య రుక్మాబాయి, నలుగురు సంతానం. భార్యభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. చుట్టూపక్కల వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ అదుపుతప్పి వ్యక్తి మృతి


నగేశ్‌ (ఫైల్‌)

జన్నారం: బైక్‌ అదుపు తప్పడంతో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై రాజవర్ధన్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని చింతగూడకు చెందిన పూదరి నాగేష్‌ (47) గతకొన్ని నెలలుగా జన్నారంలో ఇల్లు కట్టుకున్నాడు. ఇటీవల ఇరాక్‌ నుంచి వచ్చిన ఆయన శనివారం అర్ధరాత్రి చింతగూడ నుంచి జన్నారానికి బైక్‌పై తిరిగివస్తున్నాడు. ఫైడిపెల్లి గ్రామ సమీపంలోని మెయిన్‌ రోడ్డుపై అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి లచ్చన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య లత, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నాడు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌, ఇందన్‌పల్లి రేంజ్‌ కవ్వాల్‌ అటవీ సెక్షన్‌, లోతొర్రె బీట్‌లో అక్రమంగా శనివారం అర్ధరాత్రి సమయంలో తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు రేంజ్‌ అధికారి కారం శ్రీనివాస్‌ తెలిపారు. కవ్వాల్‌ సెక్షన్‌లో పెట్రోలింగ్‌ నిర్వహిస్తుండగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ కనిపించడంతో పట్టుకుని సీజ్‌ చేసి రేంజ్‌ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న ట్రాక్టర్‌ యజమాని మహిపాల్‌రెడ్డిగా తెలిసిందన్నారు. టైగర్‌ జోన్‌ ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి గాయాలు


గాయపడిన అంకులు

పెంచికల్‌పేట్‌: మండలంలోని గొంట్లపేట్‌ బస్టాండ్‌ సమీపంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంటి బయట ఆడుకుంటున్న జాడి అంకులు (4)పై పిచ్చికుక్క దాడి చేయగా అతని ముఖంపై గాయాలయ్యాయి. అతడి అరుపులు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని పిచ్చికుక్కను తరిమారు. కుటుంబ సభ్యులు బాలుడిని కాగజ్‌నగర్‌ ఆస్పత్రికి అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు.

ఉత్తములకు 'ప్రశంస'


జిల్లా జడ్జి ప్రభాకరరావు చేతుల మీదుగా అతి ఉత్కృష్ట సేవ పతకాన్ని అందుకుంటున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

- గణతంత్ర వేడుకల్లో అందజేత

కైలాస్‌నగర్‌: పోలీస్‌, రవాణాశాఖల్లో ఉత్తమ సేవలందించిన పలువురికి ఆ శాఖలు గుర్తింపునిచ్చాయి. జిల్లా కేంద్రంలోని పోలీస్‌ పరేడ్‌ మైదానంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జిల్లా జడ్జి కె.ప్రభాకరరావు, కలెక్టర్‌ రాజర్షి షా, ఎస్పీ గౌస్‌ ఆలం చేతుల మీదుగా వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. జిల్లాలో 12మంది అతి ఉత్కృష్ట సేవ పథకాలకు, మరో ఆరుగురికి ఉత్కృష్ట సేవ పథకాలకు ఎంపికైన విషయం తెలిసిందే. వీరితో పాటు ఆ శాఖలోని మరో 40మంది(సీఐలు, ఎస్‌సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల)కి ప్రశంసపత్రాలు అందజేశారు. అలాగే రవాణశాఖకు చెందిన ఏఎంవీఐ ప్రదీప్‌ కుమార్‌ గౌడ్‌కు ప్రశంసపత్రం అందుకున్నారు.


అవార్డు అందుకుంటున్న ఏఎంవీఐ ప్రదీప్‌ గౌడ్‌


ఏఎస్సై కవిత జైస్వాల్‌


హెడ్‌ కానిస్టేబుల్‌ రాధ


ఆదిలాబాద్‌రూరల్‌ సీఐ ఫణిదర్‌


జిల్లా ఎస్పీతో సేవ పతకాలు పొందిన పోలీసులు


జైనథ్‌ సీఐ పి.సాయినాథ్‌


ఇచ్చోడ సీఐ భీమేష్‌


మహిళా పోలీసు స్టేషన్‌ సీఐ శ్రీనివాస్‌


డీఎస్పీ పీసీ జోగు శివశంకర్‌


డీఎస్పీ పీసీ యూనస్‌


టూటౌన్‌ పీసీ రమేశ్‌


సీసీఎస్‌ పీసీ శ్రీనివాస్‌



ఆర్‌ఐ డి.వెంకటే్‌


ఆర్‌ఐ మురళీ


హోంగార్డ్స్‌ ఆర్‌ఐ ఎన్‌.చంద్రశేఖర్‌


ఆర్‌ఐ బి.శ్రీపద్‌


ఆర్‌ఎస్సై జాదవ్‌ గబ్బర్‌సింగ్‌


డీపీవో జూనియర్‌ అసిస్టెంట్‌ ఆశన్న


డీపీవో జూనియర్‌ అసిస్టెంట్‌ కరుణశ్రీ


డైవశాల, ఏఎస్సై, ఆదిలాబాద్‌ వన్‌టౌన్‌



డాగ్‌స్క్వాడ్‌ హెచ్‌సీ రమేశ్‌


డీఎస్బీ పీసీ ఇసాఖ్‌


డీసీఆర్బీ పీసీ శేఖర్‌

ఉద్యోగుల్లో నిరాశ

- రెండు శాఖలకే పరిమితమైన అవార్డులు


మీడియాకు పంపిన ఆహ్వానపత్రంలో అవార్డులుంటాయని ప్రకటించిన దృశ్యం

కైలాస్‌నగర్‌: ప్రభుత్వ శాఖల్లో విశిష్ట సేవలందించిన, అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులను గుర్తించి వారికి గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సం రోజున ప్రశంస పత్రాలను అందజేసి సత్కరించడం అనవాయితీగా వస్తోంది. అయితే ఆదివారం జిల్లా కేంద్రంలోని పోలీస్‌ పరేడ్‌ మైదానంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఈ అవార్డులు పోలీస్‌, రవాణా శాఖలకు మాత్రమే పరిమితమయ్యాయి. రవాణాశాఖలో కేవలం ఒక్క అధికారికే దక్కింది. అయితే ఇతర శాఖల ఉద్యోగులను విస్మరించడంపై అధికారవర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. వేడుకలు పురస్కరించుకుని జిల్లా సమాచార శాఖ ద్వారా మీడియాకు పంపించిన ఆహ్వాన పత్రాల్లోనూ ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఏటా మాదిరిగానే అన్ని శాఖల నుంచి ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, సిబ్బంది వివరాలు సైతం స్వీకరించారు. ఆయా జాబితాల్లో పేర్లు కలిగిన వారు తమకు అవార్డు వస్తుందనే ఆనందంతో పరేడ్‌గ్రౌండ్‌కు తరలివచ్చారు. అయితే కేవలం పోలీస్‌శాఖ అధికారులు, కానిస్టేబుళ్లకు మాత్రమే అవార్డులు అందజేసిన అధికారులు ఇతర ప్రభుత్వశాఖల ఊసే ఎత్తలేదు. దీంతో అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఉద్యోగులు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయమై కలెక్టరేట్‌ ఏవో బదాల రాంరెడ్డిని 'సాక్షి' సంప్రదించగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక, గ్రామ సభల్లో యంత్రాంగమంతా బీజీగా ఉన్నందునే ఉద్యోగులకు అవార్డులు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఎంపికైన ఉద్యోగులకు ఎప్పుడు ఇస్తారని అడుగగా ఆ విషయంపై తనకేమి స్పష్టత లేదని పేర్కొనడం గమనార్హం.

బాలాజీ మందిర్‌లో చోరీ


ఆలయంలో పరిశీలిస్తున్న నాయకులు, కౌన్సిలర్‌

భైంసాటౌన్‌: పట్టణంలోని భైంసా–నిర్మల్‌ జాతీయ రహదారి పక్కన, కైలాష్‌ జిన్నింగ్‌ ఫ్యాక్టరీలో గల బాలాజీ మందిర్‌లో చోరీ జరిగింది. ఆదివారం ఉదయం ఆలయానికి నిర్వాహకులు చేరుకోగా, తాళం పగులగొట్టి తలుపు తెరిచి ఉంది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా, ఏఎస్పీ అవినాష్‌కుమార్‌, సీఐ గోపినాథ్‌ ఆలయానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. స్వామివారి కిరీటం, రెండు గ్రాముల బంగారం వస్తువులు, శఠగోపం చోరీకి గురైనట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హిందూవాహిని మహిష నాయకులు మహేశ్‌, రాము, కౌన్సిలర్‌ గౌతంపింగ్లే చేరుకుని ఆలయాన్ని పరిశీలించారు. ఆలయాల్లో చోరీ ఘటనలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రామానికి చెందిన మిల్కూరు మల్లేశ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రంగపేట గ్రామానికి చెందిన ఆవునూరి రాజయ్యకు వారసత్వంగా వచ్చిన భూమిలో సాగు చేసుకుంటున్నాడు. అయితే పల్లికొండ రమేశ్‌ నుంచి ఆ భూమని కొనుగోలు చేశానని మల్లేశ్‌ శనివారం ట్రాక్టర్‌ వీల్స్‌తో పంటను ధ్వంసం చేశాడు. అడ్డుకోబోయిన రాజయ్యను కులం పేరుతో దూషించి నెట్టివేశాడు. బాధితుడు రాజయ్య ఫిర్యాదుతో ఆదివారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు


శ్రీరాంపూర్‌: విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


మందమర్రిరూరల్‌: విద్యార్థుల నృత్యాలు

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

- గనులపై గణతంత్ర వేడుకలు
- జాతీయ జెండావిష్కరించిన జీఎంలు
- ఉత్తమ ఉద్యోగులకు సన్మానం


జెండాకు వందనం చేస్తున్న మందమర్రి ఏరియా జీఎం


శ్రీరాంపూర్‌: జాతీయ జెండా ఎగురవేసి వందనం సమర్పిస్తున్న జీఎం సూర్యనారాయణ


శ్రీరాంపూర్‌: హెచ్‌ఎంఎస్‌ కార్యాలయం వద్ద ..

శ్రీరాంపూర్‌/మందమర్రిరూరల్‌: సింగరేణి గనులు, కార్మికవాడల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. సింగరేణి ఆధ్వర్యంలో 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్‌ ప్రగతి మైదానంలో, తన కార్యాలయం వద్ద శ్రీరాంపూర్‌ జీఎం ఎల్వీ సూర్యనారాయణ, మందమర్రిలోని సింగరేణి హైస్కూల్‌ మైదానంలో జీఎం దేవేందర్‌ దంపతులు జాతీయ జెండాలు ఆవిష్కరించారు. శ్రీరాంపూర్‌ జీఎం మాట్లాడుతూ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తేనే సింగరేణి ప్రగతి సాధిస్తుందని తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. శ్రీరాంపూర్‌ ఏరియాలో 18 మంది, మందమర్రి ఏరియాలో 12 మంది ఉత్తమ ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. శ్రీరాంపూర్‌ ఓపెన్‌ కాస్ట్‌ గని వద్ద పీవో టి.శ్రీనివాస్‌, శ్రీరాంపూర్‌ బస్టాండ్‌లోని ఆటో యూనియన్‌ కార్యాలయం వద్ద నాయకుడు ముఖేష్‌గౌడ్‌, హెచ్‌ఎంఎస్‌ యూనియన్‌ కార్యాలయం వద్ద కేంద్ర కార్యదర్శి గొల్ల సత్యనారాయణలు జాతీయ జెండాలు ఎగురవేశారు. కంపెనీ విజిలెన్స్‌ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం వారు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, సేవా అధ్యక్షురాలు మాలతి, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి షేక్‌ బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్‌ మురళీధర్‌ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ ఐటీలో..


జాతీయ జెండా ఎగురవేస్తున్న వీసీ ప్రొఫెసర్‌ గోవర్ధన్‌

భైంసా: బాసర ట్రిపుల్‌ ఐటీలో వీసీ ప్రొఫెసర్‌ గోవర్ధన్‌, ఓఎస్డీ మురళీదర్శన్‌, ఏవో రణధీర్‌ సాగిలు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ గోవర్ధన్‌ జాతీయ జెండావిష్కరించారు. ఎన్‌సీసీ విద్యార్థులు ప్రదర్శించిన కవాతు ఆకట్టుకుంది. వ్యాసరచన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందజేశారు. అసోసియేట్‌ డీన్‌ డాక్టర్‌ విఠల్‌, సెక్యూరిటీ ఆఫీసర్‌ డాక్టర్‌ రాజేష్‌, చీఫ్‌ వార్డెన్‌ మధుసూదన్‌రెడ్డి, స్పోర్ట్స్‌ కన్వీనర్‌ ప్రభాకర్‌, శ్యాంబాబు, రవికిరణ్‌, రఘువీర్‌, స్వప్న, విజయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో బెటాలియన్‌కు ప్రథమ స్థానం


బహుమతి అందుకుంటున్న అధికారులు

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): గణతంత్ర వేడుకల్లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో పరేడ్‌లో గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్‌ బెటాలియన్‌ నుంచి పాల్గొన్న కాంటింజెంట్‌ ప్రథమ బహుమతి సాధించింది. అసిస్టెంట్‌ కమాండెంట్‌ ఆర్‌.నాగేశ్వర్‌రావు, ఆర్‌ఐ ఎం.శ్రీనివాస్‌, ఆర్‌ఎస్సైలు రవి, రాజశేఖర్‌, సిబ్బంది మొత్తం 40 మంది ఉన్నారు. రాష్ట్రం నుంచి పాల్గొని ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. గవర్నర్‌ రామెన్‌ దేఖా, డీజీపీ అశోక్‌జునేజా బహుమతి అందజేశారు. బెటాలియన్‌ కమాండెంట్‌ వెంకటరాములు, ఆర్‌ఐలు సిబ్బంది వారిని అభినందించారు.

- గుడిపేట బెటాలియన్‌లోని పరేడ్‌ మైదానంలో కమాండెంట్‌ వెంకటరాములు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మెడికల్‌ అధికారులు సంతోశ్‌సింగ్‌, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ఆర్‌ఎస్సైలు, ఏఆర్‌ఎస్సైలు, కానిస్టేబుళ్లకు ఉత్కృష్ట పతకాలను కమాండెంట్‌ అందజేశారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


జెండా ఆవిష్కరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్‌: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏ కృషి చేస్తోందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. 76వ గణతంత్ర వేడుకలు పురస్కరించుకొని ఆదివారం ఐటీడీఏ ప్రాంగణంలో మహిళా కమిషన్‌ సభ్యురాలు ఈశ్వరిబాయిలతో కలిసి ఐటీడీఏ పీవో జాతీయజెండా ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గిరిజనుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు బాగా చదివి ఐపీఎస్‌, ఐఏఎస్‌లుగా రాణించాలన్నారు. అనంతరం ఐటీడీఏ ద్వారా గిరిజనాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను పీవో వివరించారు. 11 మండలాల్లో 11 పీహెచ్‌సీల్లో అవ్వల్‌ అంబులెన్స్‌ ద్వారా 2023–24లో 2644 మంది గర్భిణులకు ప్రసవాలు జరిగినట్లు తెలిపారు. అంతకుముందు ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని సర్టిఫికెట్లు అందజేశారు. ఏపీవో జనరల్‌ వసంత్‌రావు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్‌, ఈఈ తానాజీ, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిరి'కుండ'లోనే నాగోబా నైవేద్యం


జాతర కోసం తయారుచేసిన కుండలు

ఇచ్చోడ: ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబాకు అభిషేకం చేయాలన్నా .. నైవేద్యం సిద్ధం చేయాలన్నా సిరికొండ కుండలనే వాడుతారు. శతాబ్దాలుగా సిరికొండలోని గుగ్గిల వంశీయులు తయారు చేసిన కుండలోనే నైవేద్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. నాగోబా అప్పట్లో మెస్రం వంశీయులకు కలలో వచ్చి సిరికొండలో నివసిస్తున్న గుగ్గిల వంశీయులు తయారు చేసిన కుండలనే పూజలకు ఉపయోగించాలని చెప్పినట్లు ప్రతీతి. పూజ ప్రారంభం నుంచి అఖరి రోజు నైవేద్యం సమర్పించే వరకు ఇక్కడి కుండలనే వాడుతారు.


ప్రచారయాత్రలోనే కుండల తయారీకి ఆర్డర్‌

కేస్లాపూర్‌ నాగోబా ఆలయం నుంచి ప్రారంభమైన కటోడ మెస్రం కోసేరావు, పర్దాన్‌ దాదారావులతో కూడిన ప్రచారం రథం(ఎడ్లబండి) మొదటిరోజే సిరికొండ మండల కేంద్రంలో ఉన్న గుగ్గిల స్వామి ఇంటికి చేరుకొని జాతరకు అవసరమయ్యే కుండల తయారీకి ఆర్డర్‌ ఇస్తారు. మరుసటి రోజు నుంచే కుండల తయారీ ప్రారంభిస్తారు. తయారైన కుండలకు మహాజాతర ప్రారంభానికి రెండు రోజుల ముందు మెస్రం వంశీయులు పూజలు నిర్వహించి ఎడ్లబండిపై కేస్లాపూర్‌కు తీసుకెళ్తారు.

ఏడు రకాలు.. 350 మట్టిపాత్రలు

20 పెద్ద బాణాల్లో గంగాజలం పోసి నిల్వ ఉంచుతారు. 55 నీటి కుండలు, 55 మూతలు, 45 కడుముంతలు, 150 దీపాంతలు, 25 పెంకలను ఆదివాసీలు ఆలయ పరిసర ప్రాంతాల్లో పిండివంటలు,నైవేద్యాలు తయారు చేయడానికి వాడుతారు. వీటి తయారీకి గుగ్గిల స్వామి, అతని భార్య నెలరోజులపాటు కష్టపడుతారు. స్వామి తండ్రి రాజన్న 75 ఏళ్లపాటు కుండలు తయారు చేసి అందించారు. రాజన్న తండ్రి రాజన్న సైతం 70 ఏళ్లు కుండలను తయారు చేసి ఇచ్చారు. ప్రస్తుతం స్వామి దాదాపు 40 ఏళ్లుగా కుండలను తయారు చేసి ఇస్తున్నారు.

తరాల నుంచి..



తరతరాలుగా తాతముత్తాల నుంచి కుండలు తయారీ చేసి నాగోబాకు ఇస్తున్నాం. నాగోబా జాతర ప్రారంభం నుంచి మా వంశమే కుండలను తయారు చేస్తుంది.

– గుగ్గిల స్వామి, సిరికొండ

ఆచారం కోసం నేర్చుకుంటున్నా..

కుండ తయారీ ఉపాధిని ఇవ్వడం లేదు. దశాబ్దాల నుంచి తమ వంశమే నాగోబా జాతరకు కుండలు తయారు చేసి ఇస్తున్నాం. ఆచారం కోసం తండ్రి వద్ద కుండల తయారీ నేర్చుకుంటున్నాను.

–గుగ్గిల గంగాధర్‌, గుగ్గిల స్వామి కుమారుడు

తయారీకి నెల సమయం..

ఏడు రకాలుగా 350 మట్టిపాత్రల తయారీకి నెల సమయం పడుతుంది. అడవి నుంచి మట్టిని తీసుకురానివ్వడంలేదు. దూరప్రాంతాల నుంచి మట్టిని డబ్బులతో కొనుగోళ్లు చేస్తున్నాం. వీటిని విక్రయిస్తే రూ.50 వేలు వస్తాయి. కాని కేవలం రూ.10 వేలు ఇస్తున్నారు. దైవకార్యమని కుండలను తయారీ చేసి ఇస్తున్నాం.

– గుగ్గిల కళావతి, గుగ్గిలస్వామి భార్య